సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం ၊ 7 ၊ జూలై ၊ 2024



కనకమ్మకు తులసీ దళార్చన
విశాఖ: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.



ఘనంగా నేత్రోత్సవం
భీమిలి జగన్నాథ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ రథోత్సవాల్లో భాగంగా నేత్రోత్సవం ఘనంగా నిర్వహించారు.



అప్పన్నకు ఆర్జితసేవలు
సింహాచలం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి
- ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం : బాలికల విద్యా ప్రగతిపై సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టి సారించాలని రంపచోడవరం డీఈవో మల్లేశ్వరరావు ఆదేశించారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. పదో తరగతి సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులతో ఆయన కాసేపు మాట్లాడారు. పాఠ్యాంశాలతో పాటు స్కిల్‌డవలెప్‌మెంట్‌పై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠ్యప్రణాళికను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థినుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. హెచ్‌ఎం రోలుపల్లి వరలక్ష్మి, డిప్యూటీ వార్డెన్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలతో మెరుగైన భవిష్యత్



పతాకాన్ని ఆవిరిస్తున్న డీసీసీబీ సీఈవో వర్మ

విశాఖ విద్య: సహకార సంఘాల ద్వారా అందరికీ మెరుగైన భవిష్యత్ ఇవ్వడమే లక్ష్యంగా అధికారులు, ఉద్యోగులంతా సమన్వయంతో పని చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో డి.వి.ఎస్. వర్మ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకుని శనివారం మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో విశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్, అనకాపల్లి జిల్లా కో–ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరావు, బ్యాంక్ డిప్యూటీ రిజిస్ట్రార్ జి.హరిప్రసాద్‌తో కలసి పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపడమే లక్ష్యంగా సహకార బ్యాంకులు పని చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని కో–ఆపరేటివ్ బ్యాంకులు, వాటి పరిధిలోని సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. సహకార రంగం పట్ల అవగాహన పెంచుకోవడం, అంతర్జాతీయ సంఘీభావం, ఆర్థిక సామర్థ్యం, సమానత్వం, ప్రపంచ శాంతిని ప్రోత్సహించడమే అంతర్జాతీయ సహకార దినోత్సవ ముఖ్య ఉద్దేమన్నారు. సహకార విద్యాధికారి జి.సోమేశ్వరరావు, బ్యాంకు జీఎం డి.అన్నపూర్ణ, బి.శ్రీనివాసరావు, బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల సర్వీస్ రెన్యువల్‌కు దరఖాస్తులు
మద్దిలపాలెం (విశాఖ): జోన్–1, 2 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికపై పని చేస్తున్న అధ్యాపకులు సర్వీస్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్–1లో 147, జోన్–2లో 174 పోస్టులకు రెన్యువల్ చేస్తారని పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో 2024, మార్చి 31 నాటికి కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పని చేసిన వారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. జూలై 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీన జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో కౌన్సెలింగ్, 16న రెన్యువల్ అయిన ఒప్పంద అధ్యాపకుల ఒప్పందం ఉంటుందని వివరించారు.

విశాఖలో 28 మంది ట్రైనీ ఐపీఎస్‌లు



ట్రైనీ ఐపీఎస్ బృందంతో సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ : మేరీటైమ్ సెక్యూరిటీ మాడ్యూల్ నిమిత్తం 28 మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులు విశాఖకు వచ్చారు. ఈ సందర్భంగా శనివారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కలిశారు. అనంతరం బీచ్ రోడ్డులో పోలీస్ ఆఫీసర్స్ మెస్‌తో నిర్వహించిన సమావేశంలో సీపీ మేరీటైమ్ సెక్యూరిటీలో అనుభవాలు, మెలకువలను వివరించారు. దేశ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన విధులపై అవగాహన కల్పించారు.

కాఫీ రైతులకు.. వరుణ కటాక్షం

కాఫీ రైతులకు కొన్నేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ఈ ఏడాది కూడా ముందుగా వర్షాలు కురవడంతో పూత కూడా నెలరోజులు ముందుగా వచ్చింది. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో కాఫీ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- అనుకూలించిన వాతావరణం
- మేలు చేసిన ముందస్తు వర్షాలు
- ఈ ఏడాది ముందుగా వచ్చిన పూత
- పిందెతో కళకళ
- మంచి దిగుబడి వచ్చే అవకాశం



పాడేరు మండలం మోదాపల్లిలో పిందెలతో కళకళలాడుతున్న కాఫీ తోటలు

సాక్షి,పాడేరు: ఏటా గిరిజనులకు మంచి ఆదాయం ఇస్తున్న కాఫీ సాగు ఈ ఏడాది కూడా సిరులు కురిపించనుంది. గత మూడేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ముందస్తుగా కురుస్తున్న వర్షాలు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. ఈ ఏడాది కూడా ఏప్రిల్, మే నెలల్లో కాఫీతోటలు విరబూశాయి. పిందెలతో కళకళలాడుతున్నాయి. అదేస్థాయిలో దిగుబడి ఉంటుందని కాఫీ రైతులు ఆశిస్తున్నారు.

పాడేరు డివిజన్‌లో..

జిల్లాలో పాడేరు డివిజన్‌లో మాత్రమే కాఫీ తోటలు ఉన్నాయి. 11 మండలాల పరిధిలో సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా 1.50 లక్షల ఎకరాలు ఫలసాయం ఇస్తున్నాయి. సుమారు 12 వేల టన్నుల క్లీన్ కాఫీని గిరిజన రైతులు మార్కెటింగ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం జీసీసీ ఆధ్వర్యంలో కిలో రూ.280 ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసింది. దీంతో మంచి దిగుబడి సాధించిన రైతులంతా అధిక ఆదాయం పొందారు.

గిట్టుబాటు ధరకు కొనుగోలు

పాడేరు ఐటీడీఏతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు కూడా పండ్ల దశలోనే కాఫీ పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేశాయి. సుమారు 1.20 లక్షల గిరిజన కుటుంబాలు ఎకరాకు రూ.60 వేల వరకు ఆదాయం పొందారు. ఈ ఏడాది కూడా మంచి ఆదాయం వచ్చే పరిస్థితి ఉందని వారు ఆశిస్తున్నారు.

10వేల ఎకరాల్లో కాఫీ మొక్కల పునరుద్ధరణ

పాత తోటల్లో కాఫీ మొక్కల పునరుద్ధరణకు పాడేరు ఐటీడీఏ చర్యలు తీసుకుంది. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల కాఫీ తోటల్లో పది వేల ఎకరాలు ఫలసాయం ఇవ్వడం లేదు. దీని ప్రభావం దిగుబడిపై చూపిస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు ఆయా తోటల్లో ఆ ఎండిన మొక్కలను తొలగించి కొత్తగా కాఫీ మొక్కలు నాటేందుకు కసరత్తు మొదలు పెట్టారు.

మొక్కల పంపిణీకి నర్సరీలు

ఎకరానికి 2,500 చొప్పున కాఫీ మొక్కల పంపిణీకి నర్సరీలు ఏర్పాటుచేశారు. ఈ నెలాఖరు నుంచి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. మూడేళ్ల తరువాత ఈ మొక్కలు కూడా ఫలసాయం ఇవ్వడం ద్వారా దిగుబడులు పెరుగుతాయని వారు తెలిపారు.

అన్నివిధాలా ప్రోత్సాహం



గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ తోటల్లో ఈ ఏడాది కూడా కాపు అధికంగా ఉంది. అయితే పిందె, కాయ దశలో చీడపీడల బెడద లేకుండా సస్యరక్షణ చేపట్టేందుకు ఐడీటీఏ కాఫీ విభాగం అన్ని విధాలా ప్రోత్సహిస్తుంది. ఈఏడాది కూడా గిట్టుబాటు ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసేందుకు జీసీసీ ముందుకు వస్తుంది. ఐటీడీఏ కూడా కాఫీపంటకు గిట్టుబాటు ధర లక్ష్యంగా పనిచేస్తుంది.

– అశోక్, కాఫీ విభాగం ఏడీ, ఐటీడీఏ, పాడేరు

సారా తయారీపై తిరుగుబాటు

- వాతంగి, ఓగిపాలెం, ఓకుర్తి ప్రాంతాల్లోని బట్టీలపై మహిళల దాడి
- పులుపు, బెల్లం ధ్వంసం
- అధికారులు పట్టించుకోనందునే ఉద్యమించామని వెల్లడి



సారా బట్టీని చుట్టుముట్టిన మహిళలు



సారా తయారీ సామగ్రిని తగులబెడుతున్న మహిళలు

రాజవొమ్మంగి: ఏరులై పారుతున్న సారా వల్ల కలిగే అనర్థాలను గుర్తించిన మహిళలు ఉద్యమించారు. సారా బట్టీలను ధ్వంసం చేసి నామరూపాలు లేకుండా చేశారు. వివరాలిలావున్నాయి. మండల పరిధిలోని వాతంగి, ఓగిపాలెం, ఓకుర్తి తదితర ప్రాంతాల్లో భారీగా నాటు సారా తయారవుతోంది. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన కరువైంది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 250 మంది మహిళలు శనివారం సాయంత్రం సారా బట్టీలపై దాడి చేశారు. సుమారు 18 డ్రమ్ముల్లో నిల్వ చేసిన సారా ఊటను పారబోశారు. సిద్ధంగా ఉంచిన బెల్లం మూటలను తగులబెట్టారు. సారా తయారి సామగ్రి, పొయ్యిలను నామ రూపాలు లేకుండా చేశారు. తమ భర్తలు సారాకు బానిస కావడంతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. తమ భర్తలు తప్పతాగి వేధిస్తుండటంతో ఉద్యమించాల్సి వచ్చిందని వారు పేర్కొన్నారు.



బెల్లం పులుపును పారబోస్తున్న మహిళలు



సారా బట్టీల వద్ద పెద్ద ఎత్తున బెల్లం నిల్వలు

గెడ్డలను దాటి.. కాలినడకన వెళ్లి..

- కొయ్యూరు సీడీపీవో, సిబ్బంది సాహసం
- మారుమూల పెదలంక కొత్తూరు గ్రామ సందర్శన
- పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్యపై గ్రామస్తులకు అవగాహన
- అంగన్‌వాడీ రేషన్ పంపిణీ పరిశీలన



ఉధృతంగా ప్రవహిస్తున్న కాకులమామిడి గెడ్డను దాటుతున్న సీడీపీవో విజయకుమారి, సిబ్బంది



పెదలంక కొత్తూరు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: పెదలంక కొత్తూరు.. మండలంలో అత్యంత మారుమూల ప్రాంతం. అక్కడికి చేరుకోవాలంటే కిలోమీటర్ల పొడవునా కాలినడకన గెడ్డలు దాటి వెళ్లాలి. అలాంటి ప్రాంతానికి వెళ్లేందుకు కొయ్యూరు సీడీపీవో విజయకుమారి సాహసం చేశారు. శనివారం ఆమె సూపర్‌వైజర్ మహలక్ష్మితో కలిసి అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వివరాలిలా ఉన్నాయి. కొయ్యూరు మండల పరిధిలో ఈ గ్రామం ఉన్నప్పటికీ మండల కేంద్రమైన వై.రామవరానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడకు వెళ్లేందుకు కాలినడకన బయలుదేరిన వారు కాకులమామిడి, జ్యోతులమామిడి గ్రామాల మీదుగా రెండు కాలువలను దాటి వెళ్లారు. అష్టకష్టాలు పడి ఎట్టకేలకు చేరుకున్న వారు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ తల్లులతో మాట్లాడారు. పోష్టికాహారం ప్రాధాన్యతను, పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలందరిని కేంద్రానికి పంపాలని కోరారు. చదవుపై ఎవరు నిర్లక్ష్యం చేయరాదని వారికి సూసించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ దూరంలో ఉన్న కేంద్రాన్ని చూడాలన్న లక్ష్యంతో వెళ్లామన్నారు. రెండు కాలువలు దాటామని, వాటిలో ఒకటి వర్షం కారణంగా ఉధృతిగా ప్రవహిస్తోందన్నారు. ఈ సమయంలో ఇబ్బంది పడ్డామని తెలిపారు. పెదలంక కొత్తూరు కేంద్రంగా ఆరు గ్రామాలకు అంగన్‌వాడీ రేషన్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సక్రమంగా పంపిణీ జరుగుతున్నది లేనిదీ పరిశీలించామని ఆమె పేర్కొన్నారు.

సంపూర్ణత అభియాన్‌తో ఎంతో మేలు

- తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యం
- పౌష్టికాహారం, వైద్య ఆరోగ్య సేవలు విస్తృతం
- కలెక్టర్ దినేష్‌కుమార్



గర్భిణులకు చీరలు, పౌష్టికాహర కిట్లు పంపిణీ చేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి



చిన్నారికి బాలామృతం తినిపిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే శిరీషా దేవి



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సాక్షి,పాడేరు: అభివృద్ధి, సంక్షేమం అట్టడుస్థాయి వరకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలుజేస్తున్న సంపూర్ణత అభియాన్ పథకం ఎంతో మేలు చేస్తుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో సంపూర్ణత అభియాన్ పథకాన్ని ఆయనతో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఐసీడీఎస్, వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లలో చిరుధాన్యాలు, వాటితో తయారు చేసే పౌష్టికాహారం నమునాలను పరిశీలించారు.అలాగే చిన్నారులకు బాలామృతంను వారు తినిపించారు. గర్భిణులకు సాముహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. వీరికి ఎంపీ తనూజరాణి చీరలు, పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వై.రామవరం,గంగవరం ,మారేడుమిల్లి మండలాలు సంపూర్ణ అభియాన్ పథకానికి ఎంపికయ్యాయన్నారు. ఈ పథకంతో ఆరోగ్యం, పౌష్టికాహారం, వ్యవసాయ అనుబంధ శాఖలు, విద్యా, ఇతర మౌలిక సదుపాయాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయా శాఖల అధికారులంతా నిర్దేశిత ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయాల ఉద్యోగులు భాగస్వాములు కావాలని కోరారు. బాల్య వివాహాలు అరికట్టాలని, గర్భిణులు, బాలింతలు,శిశువుల సంక్షేమం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ శాఖలు మాతాశిశు ఆరోగ్యం,సంపూర్ణ పౌష్టికాహార పంపిణీ బాధ్యతగా చేపట్టాలన్నారు.

మాతాశిశు సంక్షేమమే లక్ష్యం: అరకు ఎంపీ

నీత్ ఆయోగ్‌లో భాగంగా సంపూర్ణత అభియాన్ పథకంకు జిల్లాలో మూడు మండలాలు ఎంపికవ్వడం సంతోషంగా తుందని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి అన్నారు.గిరిజన ప్రాంతాలలో మాతాశిశు సంక్షేమమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించడంతో పాటు వైద్య ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. మాతా శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నీత్ ఆయోగ్ ప్రతినిధి సాయితేజ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,ఐసీడీఎస్ పీడీ ఎస్.సూర్యలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎస్ఎస్ఆర్‌కే.పట్నాయక్, గణాంక అధికారి వెంకటరావు, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీపీఎం భాస్కరరావు, పాడేరు సీడీపీవో ఝాన్సీ రాణి,ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

గంగవరం: వెనుకబడిన ప్రాంతాలకు నీత్ ఆయోగ్ ఆధ్వర్యంలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని రంపచోడవరం ఎమ్మెల్యే ఎం.శిరీషాదేవి అన్నారు. శనివారం నీత్ ఆయోగ్ మండల కోఆర్డినేటర్, ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. రంపచోడవరం నియోజకవర్గంలో గంగవరం, వై.రామవరం, మారేడుమిల్లి మండలాలను వెనుకబడిన ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. జెడ్పీటీసీ బేబీరత్నం, ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మి మాట్లాడారు. వైస్ ఎంపీపీలు కె.రామతులసి, కె. గంగాదేవి, సర్పంచ్ అక్కమ్మ, మాజీ ఎంపీపీ డా. తీగల ప్రభ, మాజీ వైస్ ఎంపీపీ కనిగిరి రాంబాబు, మాజీ కోఆప్షన్ సభ్యుడు పాము అర్జున, దొరమామిడి ఎంపీటీసీ పండా ఆదినారాయణ, వైద్యాధికారి భావన, ఏవో విశ్వనాథ్ , నీత్ అయోగ్ ప్రతినిధి (ఏబీపీఎఫ్) హేమ మాధురి మాట్లాడారు. స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొలుత విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీటీసీ కనకలక్ష్మి, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశయాన్ని నెరవేర్చండి



మారేడుమిల్లిలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, అధికారులు

మారేడుమిల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నీత్ ఆయోగ్ సంపూర్ణత అభియాన్ పథకం ఆశయం నెరవేర్చేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్ కోరారు. స్థానిక పాత మండల కార్యాలయం వద్ద ఎంపీడీవో వీరా కిషోర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ పథకానికి మారేడుమిల్లి మండలాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయన్నారు. వాటి ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. సంపూర్ణత అభియాన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండా జాకబ్, వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, ఎంపీటీసీ కె. సువర్ణ రాజు పాల్గొన్నారు.

గిరిజనులకు సేవ చేయడమే లక్ష్యం



నుర్మతి అవుట్‌పోస్ట్ వద్ద రైతులకు సిల్వర్‌ఓక్ మొక్కలను పంపిణీ చేస్తున్న సీఐ రమేష్, సీఆర్‌పీఎఫ్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కిషోర్



జీలుగులగొయ్యి గ్రామంలో నిర్మించిన మంచినీటి పథకం వద్ద సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ పోలీసులు

- సీఐ రమేష్, సీఆర్‌పీఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్ కిషోర్

జి.మాడుగుల: గిరిజన గ్రామాల్లో ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా సీఆర్‌పీఎఫ్, పోలీసుశాఖ పని చేస్తోందని స్థానిక సీఐ రమేష్, సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ సెకెండ్ ఇన్ కమాండెంట్ కిషోర్ తెలిపారు. మండలంలో సీఆర్‌పీఎఫ్198 బెటాలియన్, జిల్లా పోలీస్ శాఖ అధ్వర్యంలో శనివారం నుర్మతి అవుట్ పోస్టు పరిధిలో గల సిరసపల్లి, జీలుగుగొయి గ్రామాల్లో నిర్మించిన మంచినీటి పథకాన్ని వారు ప్రారంభించారు. గిరిజన రైతులకు నాలుగు వేల సిల్వర్ ఓటక్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులు గిరిజన గ్రామాలకు వెళ్లినప్పుడు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని అక్కడి ప్రజలు వాపోయేవారన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేయడంతో బోరు, 2హెచ్‌పీ మోటార్, ట్యాంక్ ఏర్పాటుచేసి తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. సీఆర్‌పీఎఫ్ 198 బీఎన్ కమాండెంట్ రాజేష్‌పాండే, సెకెండ్ ఇన్ కామాండెంట్ కిషోర్ హామీ మేరకు ప్రత్యేక చొరవతో ఈ పథకం ఏర్పాటుకు కృషి జరిగిందన్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా, అనదపు ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట టోకరా

ఉక్కునగరం (విశాఖ): కేవైసీ అప్‌డేట్ పేరిట వచ్చిన లింక్‌ను తెరిచిన కొంత మంది తమ బ్యాంక్ ఖాతాల్లో డబ్బు మాయం కావడంతో లబోదిబోమంటున్నారు. రెండు రోజులుగా పలువురు మొబైల్స్‌కు యూనియన్ బ్యాంక్ కేవైసీ అప్‌డేట్.ఏపీకే పేరిట లింక్ మేసేజ్‌లు వస్తున్నాయి. కేవైసీ అప్‌డేట్ చేయాలనే ఉద్దేశంతో చాలా మంది ఈ లింక్ తెరిచారు. దీంతో వారి ఖాతాల్లో ఉన్న నగదు మాయమైంది. ఒకరిది రూ.20వేలు పోగా, మరొకరి ఖాతాలో రూ.40వేలు మాయమైంది. గరిష్ఠంగా ఒకరిది రూ.లక్ష పోయింది. దీంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వారు ఈ కేసులను సైబర్ క్రైం స్టేషన్‌కు బదిలీ చేశారు. తెలియని లింక్‌లను తెరవొద్దని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నా.. ప్రజలు అప్రమత్తంగా లేకుండా మోసాల్లో చిక్కుకోవడం పట్ల బ్యాంక్ అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల నుంచి ఎటువంటి కాల్స్, మెసేజ్‌లు రావని, ఏమైనా అధికారిక సమాచారం ఉంటే ఆయా బ్యాంకుల అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే పొందుపరుస్తామని అధికారులు తెలిపారు.

సూర్యకాంతుల కనువిందు



అస్తమించే వేళ భానుడు అలరించాడు. సప్తవర్ణ కాంతులతో కనువిందు చేశాడు. యండపల్లివలస రైల్వే స్టేషన్ సమీపంలో



ఈ అపురూప దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

– అరకులోయ రూరల్

క్లుప్తంగా

గురుకులాలపై నమ్మకాన్ని నిలబెట్టాలి


మాట్లాడుతున్న సునీల్ రాజ్‌కుమార్

అరిలోవ(విశాఖ): సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కె.సునీల్ రాజ్‌కుమార్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సూచించారు. శ్రీకృష్ణాపురం గురుకులాన్ని శనివారం సందర్శించిన ఆయన ఇక్కడ సమావేశ మందిరంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని గురుకులాల ప్రిన్సిపాల్స్, ఆఫీస్ సూపరింటెండెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురుకులాల సిబ్బందిపై నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేరుస్తున్నారని, దానిని నిలబెట్టుకోవాలని అన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారం, వసతి, వైద్యంతో పాటు విద్య అందించడానికి బోధన, బోధనేతర సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గురుకుల విద్యార్థులను ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులు ఆయా సీట్లు సాధించడం అభినందనీయమని, ఆ ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో గురుకుల విద్యార్థుల కోసం రెండుచోట్ల ఐఐటీ ఇన్‌స్టిట్యూట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గురుకులాల సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతోందని, ఇందులో భాగంగా పదోన్నతుల విషయంలో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డీఎస్సీలో 439 మంది ఉపాధ్యాయుల భర్తీకి నోటిఫికేషన్ రానుందన్నారు. కార్యక్రమంలో విశాఖ, అనకాపల్లి గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, శ్రీకృష్ణాపురం గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, రెండు జిల్లాల గురుకులాల ప్రిన్సిపాల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రెజరీ శాఖలో అవినీతిపై రాష్ట్ర డైరెక్టర్ విచారణ

మహారాణిపేట(విశాఖ): ట్రెజరీ శాఖలో అవినీతి విలయతాండవం చేస్తోందని పలు శాఖల అధికారులు, సిబ్బంది రాష్ట్ర ట్రెజరీ, లెక్కల శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఆయన శనివారం డీటీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ట్రెజరీ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులపై వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదులు చేసిన వారి నుంచి వివరాలు సేకరించారు. పలు శాఖల అధికారులు, ఉద్యోగులు తాము పడుతున్న ఇబ్బందులను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కొంత మంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. అనంతరం విశాఖ డీటీవో యార్లగడ్డ సుధాకరరావు, ఏటీవోలు, ఎస్‌టీవోలను డైరెక్టర్ విచారించారు. కాగా.. విధులకు సక్రమంగా హాజరు కాని 8 మంది ట్రెజరీ ఉద్యోగులకు ఇటీవల ఉన్నతాధికారులకు మెమోలు జారీ చేసిన సంగతి తెలిసిందే.

నగరం.. సర్వం జగన్నాథం

- నేటి నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు, వివిధ సంస్థలు

దాబాగార్డెన్స్(విశాఖ): జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా నగరంలో ఆదివారం నుంచి ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది. 10 రోజుల పాటు రథయాత్ర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. పూరీ తరహాలోనే జగన్నాథుడి రథయాత్రను నిర్వహించేందుకు నగరంలోని అతిపురాతన టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 9.20 గంటలకు స్వామిని రథంపైకి ఆహ్వానించనున్నారు. సాయంత్రం 4.15 గంటలకు టౌన్‌కొత్త రోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజ్ డౌన్‌రోడ్డు, పూర్ణామార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా టర్నర్ సత్రం వరకు వేదపారాయణం.. గీతాపారాయణాలు.. మేళ తాళాలతో అత్యంత వైభవంగా స్వామి రథయాత్ర నిర్వహించనున్నారు.

- జిల్లా పరిషత్ శ్రీకృష్ణ మందిర్‌లో సాయంత్రం ఐదు గంటలకు బలభద్ర, సుభద్రా సమేత జగన్నాథ స్వామిని రథంపై ఊరేగించనున్నారు.
- సాగర్‌నగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు రథయాత్ర ప్రారంభకానుంది. సాగరతీరాన వీఎంఆర్డీఏ పార్కు వద్ద బయలుదేరి.. వైఎంసీఏ, కాళీమాత ఆలయం, రామకృష్ణామిషన్ మీదుగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం వరకు రథయాత్ర సాగనుంది. దారి పొడవునా బెంగాల్, ఒడిశాకు చెందిన పలు భజన మండళ్ల భజనలు, నాదస్వరం, కీర్తనలు, కోలాటం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గురజాడ కళాక్షేత్రానికి చేరుకున్న తర్వాత స్వామికి 1008 రకాల ప్రత్యేక వంటకాలను ప్రీతి పూర్వకంగా అర్పించనున్నారు. అనంతరం భక్తులకు వితరణ చేయనున్నారు.


రథం ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో..

బీచ్‌రోడ్డు: ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా రేడియో వద్ద ఉన్న జగన్నాథ స్వామి ఆలయం నుంచి సాయంత్రం రథయాత్ర ప్రారంభం కానుందని ఉత్కల్ సమాజ్ అధ్యక్షుడు నాయక్ తెలిపారు. సిరిపురం, ఏయూ అవుట్ గేట్, చిన్న వాల్తేరు, వీఎంఆర్డీఏ పార్కు మీదుగా లాసన్స్ బే కాలనీకు రథయాత్ర చేరుకుంటుందన్నారు.


పూల అలంకరణలో ప్రధాన ఆలయం

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



టౌన్ కొత్తరోడ్డు జగన్నాథ స్వామి ఆలయం నుంచి ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు రథయాత్ర ప్రారంభమై టర్నర్ చౌల్ట్రీ వద్ద ముగియనుంది. ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు స్వామి దశావతారాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్న దృష్ట్యా క్యూలు, బారికేడ్లు ఏర్పాటు చేశాం. భక్తులకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశాం. వివిధ శాఖల నుంచి పలువురు సిబ్బందిని నియమించాం. ప్రతి రోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేయనున్నాం. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.200 టికెట్లపై ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నాం.

– టి.రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈవో

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

చింతపల్లిరూరల్: పసుపు సాగులో మెలకువలు, సాంకేతిక పద్ధతులు అనుసరిస్తే రైతులు మంచి ప్రయోజనాలను పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేష్ అన్నారు. స్థానిక హెచ్ఎన్‌టీసీ కార్యాలయంలో శనివారం పసుపు సాగులో అధిక దిగుబడుల అంశంపై ఉద్యానశాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు సాగులో యంత్రాలను అనుసాంధానం చేసేందుకు అందరు రైతులు ప్రయత్నించాలన్నారు. దీని వల్ల పెట్టుబడి తగ్గి ,ఆదాయం పెరుగుతుందన్నారు. అదే విధంగా ప్రభుత్వం రాయితీపై అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా రైతులు సాగు విధానంలో మార్పులు చేసుకోవాలన్నారు. పసుపు పంటకు ప్రధానంగా పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా మేలైన దిగుబడులు వస్తాయన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త శివకుమార్, హెచ్‌వో బాలకర్ణ, సాయిల్ టెస్టింగ్ ఏవో శోభ, చింతపల్లి , జీకేవీధి మండల వ్యవసాయశాఖ అధికారులు శ్రీనివాస్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేష్

విద్యుత్‌షాక్‌తో గిరిజన యువకుడి మృతి


ప్రమాదంలో మృతిచెందిన సిరిబాల యువకుడు జోరంగి టైసన్


భార్య సాయితో జోరంగి టైసన్(ఫైల్)

గూడెంకొత్తవీధి: మండలంలోని సిరిబాలలో శనివారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోరంగి టైసన్(22) అనే యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిరిబాల గ్రామానికి చెందిన జోరంగి టైసన్‌కు ఏడాదిన్నర కిందట వివాహం జరిగింది. ఈ యువకుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. విద్యుత్ పనులు చేయడంలో కొంత అనుభవం ఉంది.గ్రామంలో వీధి లైట్లు వేసేందుకు శనివారం విద్యుత్తు స్తంభం ఎక్కాడు. ఎల్‌టీ లైన్ సప్లయి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపి వీధి లైట్లు బిగిస్తుండగా అతడు ఎక్కిన నిచ్చెన హైటెన్షన్ (హెచ్‌టీ) విద్యుత్తు లైనుకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయాడు. అతన్ని హుటాహుటిన స్థానికులు చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. టైసన్‌కు భార్య, ఐదునెలల కుమారుడు ఉన్నారు. చింతపల్లి ఏఈ ప్రభాకరరావును సంప్రదించగా తమ విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేయడంతో ప్రమాదం జరిగినట్టు తెలిపారు.దీనిపై విచారణ చేపట్టినట్టు ఆయన చెప్పారు.

ఉత్కంఠ పోరులో టైటాన్స్ గెలుపు

- ఒక్క పరుగు తేడాతో టైగర్స్ ఓటమి
- అవినాష్ అజేయ సెంచరీ
- సీజన్‌లోనే అత్యధిక స్కోర్‌లు నమోదు

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ టీ–20 మూడో సీజన్‌లో బెజవాడ టైగర్స్‌తో తలపడిన గోదావరి టైటాన్స్ ఒక్క పరుగు తేడాతో విజయాన్నందుకుంది. ఇరు జట్లు సీజన్‌లోనే అత్యధిక స్కోర్ నమోదు చేశాయి. బెజవాడ టైగర్స్ టాస్ గెలిచి టైటాన్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించగా.. 225 పరుగులతో సీజన్‌లోనే అత్యధిక స్కోర్‌ను నమోదు చేసింది. టైగర్స్ కూడా దీటుగానే ఆడినప్పటికీ.. కేవలం ఒక్క పరుగు తేడాతో పరాజయం పాలైంది. పీఎంపాలెంలోని వైఎస్సార్ స్టేడియంలో శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో టైటాన్స్ టాపార్డర్ ఏకంగా 218 పరుగులు చేయగా... చివరి పది బంతుల్లోనే ఏడు పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయి ఆలౌట్ అయింది. తొలి వికెట్‌కు కెప్టెన్ జ్ఞానేశ్వర్(41, 30 బంతుల్లోనే 4x4, 2x6) వంశీకృష్ణ(45, 33 బంతుల్లోనే 3x4,3x6) 85 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి గట్టి పునాది వేశారు. వన్‌డౌన్‌గా వచ్చిన వికెట్‌కీపర్ పాండు రంగరాజు(51, 24 బంతుల్లోనే 3x4,4x6) అర్ధసెంచరీ నమోదు చేశాడు. హేమంత్‌రెడ్డి సైతం(60, 22 బంతుల్లోనే 5x4.5x6) అర్ధసెంచరీ నమోదు చేశాడు. శశికాంత్ 17 పరుగులు చేయగా.. తొలి నాలుగు వికెట్లకు 218 పరుగులు నమోదయ్యాయి. అప్పటికే 18.2 ఓవర్లు ముగియగా పరుగులు తీసే క్రమంలో 20వ ఓవర్ చివరి బంతికి 225 పరుగుల వద్ద ఆలౌటైంది. టైగర్స్ బౌలర్లు అఖిల్ నాలుగు, హరిశంకర్ మూడు వికెట్లు తీశారు.

సీజన్‌లోనే అత్యధిక లక్ష్య ఛేదన

226 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన టైగర్స్ తొలి వికెట్‌ను 17 పరుగులకే కోల్పోయింది. ధృవ్ 17 పరుగులకే వెనుదిరగ్గా కెప్టెన్‌గా బాధ్యత తీసుకున్న మహీప్ ఒక్క పరుగుకే పెవిలియన్‌కు చేరాడు. దూకుడుగా ఆడిన లక్ష్మణ్(46, 23 బంతుల్లో 6x4,3x6) సమన్విత్‌కు క్లీన్ బౌల్డ్ అయ్యాడు. దీంతో 73 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి టైగర్స్ కష్టాల్లో పడింది. అయితే అవినాష్ అజేయంగా సీజన్‌లోనే తొలి సెంచరీ నమోదు చేశాడు. అయినప్పటికీ ఒక్క పరుగు తేడాతో టైగర్స్ ఓటమి పాలైంది. అవినాష్ (105, 58 బంతుల్లోనే 2x4,11x6) చివరికంటూ నిలిచాడు. సాయిరాహుల్(28) సహకరించగా ఇన్నింగ్స్ చివరి బంతికి మనీష్(13) రనౌట్ కావడంతో ఆరో వికెట్ 224 పరుగుల వద్ద కూలింది. అహితేష్ రెండు వికెట్లు తీశాడు.


అజేయ సెంచరీతో చెలరేగిన అవినాష్


అర్ధసెంచరీ చేసిన పాండురంగరాజు

వారియర్స్‌పై రైడర్స్ విజయం

ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన రెండో మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కోస్టల్ రైడర్స్ ఎనిమిది వికెట్లకు 165 పరుగులు చేసింది. ఓపెనర్, కెప్టెన్ రషీద్ 48 బంతుల్లో 67 పరుగుల చేయగా మరో ఓపెనర్ ధరణి కుమార్ 21 పరుగులు చేశాడు. తొలి వికెట్‌కు వీరిజోడి 87 పరుగులు జోడించింది. అభిషేక్ 28, నరసింహారాజు 23 పరుగులతో రాణించారు. వై.రెడ్డి 26 పరుగులిచ్చి ఐదుగుర్ని పెవిలియన్‌కు పంపాడు. ప్రతిగా వైజాగ్ వారియర్స్ పది ఓవర్లు ముగిసేసరికి 2 వికెట్లు కోల్పోయి 74 పరుగులు చేసింది. ఓపెనర్ సుజన్ దకౌట్ కాగా మరో ఓపెనర్ అశ్విన్‌హెబ్బర్ 31 పరుగులు చేశాడు. కెప్టెన్ భరత్(69) నిలకడగా ఆడగా కరణ్‌షిండే(41) సహకరించాడు. వీరిజోడి మూడో వికెట్‌కు 91 పరుగులు జోడించింది. వారియర్స్ విజయం దిశగా సాగుతున్న తరుణంలో రైడర్స్ బౌలర్ స్టీఫెన్ 19వ ఓవర్ తొలి బంతికి భరత్, చివరి బంతికి కరణ్ పెవిలియన్ దారి పట్టించాడు. చివరికి వారియర్స్ నాలుగు వికెట్లే కోల్పోయినా 162 పరుగులతో ఇన్నింగ్స్ ముగించడంతో కోస్టల్ రైడర్స్‌ను విజయం వరించింది. స్టీఫెన్ మూడు వికెట్లు తీశాడు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడ్డ ట్రాక్టర్


ప్రమాదంలో గాయపడ్డ లింగన్న

ముంచంగిపుట్టు: మండలంలో గల వనభసింగి పంచాయతీ కొత్తూరు గ్రామంలోని పొలాల్లో దున్నతున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్‌కి తీవ్రగాయలయ్యాయి.దీనిపై స్థానికులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పెదబయలు మండలం రూడకోట పంచాయతీ బడంబీరు గ్రామానికి చెందిన కోడా లింగన్న ట్రాక్టర్‌తో కొత్తూరు గ్రామంలోని పంట పోలాలను దున్నడం కోసం శనివారం ఉదయం వచ్చాడు. పోలం దున్నతున్న సమయంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ లింగన్నకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారి సంతోష్ క్షతగాత్రుడికి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం లింగన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దివ్యాంగుడిపై దాడిచేసిన ఆరుగురి అరెస్టు

పీఎం పాలెం(విశాఖ): దివ్యాంగుడిపై దాడిచేసిన ఆరుగుర్ని పీఎం పాలెం పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించారు. సీఐ రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మది వైఎస్సార్ కాలనీలో నివసిస్తున్న చిరికి రాజ్ కిషోర్ తిమ్మాపురంలోని ఓ ప్రయివేటు విద్యా సంస్థలో పని చేస్తున్నాడు. అతడు దివ్యాంగుడు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం 8 గంటల సమయంలో విధులు నిర్వహించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలు దేరాడు. జురాంగ్ రోడ్డులోని నారాయణ స్కూల్ సమీపంలో మధురవాడ ,పీఎం పాలెం ప్రాంతాకు చెందిన పైల వినయ్, తేజ, యోగి మరో ముగ్గురు కలిసి రోడ్డు పక్కన మద్యం సేవిస్తున్నారు. ఆదే రోడ్డులో బైకుపై వస్తున్న దివ్యాంగుడు రాజ్ కిషోర్‌ను అడ్డగించి దాడిచేశారు. అతని జేబులో ఉన్న రూ.మూడు వేలు బలవంతంగా లాక్కున్నారు. ఇంటికి వచ్చి తనపై దాడిచేసి బలవంతంగా డబ్బులు లాక్కున్నారని చెప్పడంతో బాధితుడు తమ్ముడు భుజేష్ సంఘటన స్థలానికి వెళ్లి వీరిని నిలదీశాడు. ఈ క్రమంలో రాజ్‌కిషోర్, భుజేష్‌లను పై ఆరుగురు దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

అనకాపల్లి : మండలంలో శంకరం జాతీయ రహదారిలో రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన నాగమణిని గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ సోంబాబు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.